క్లుప్తంగా

హామీలు నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

దుబ్బాకటౌన్: శాసనసభ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సుభాస్‌రెడ్డి, మూడో వార్డు కౌన్సిలర్ మల్లారెడ్డి ఆరోపించారు. శనివారం స్థానిక బస్టాండ్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుంచి ఇప్పటి వరకు క్యాంపు కార్యాలయం తాళాలు తెరవలేదన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుపై అనుచిత వాఖ్యలుచేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శివప్రసాద్, కిషన్ శ్రీకాంత్, ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.

సబ్‌కోర్టు ఏర్పాటు చేయాలని వినతి



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న న్యాయవాదులు

హుస్నాబాద్: ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికైన సబ్‌కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అర్హత ఉన్నా గత నేతల వైఫల్యంతో సబ్ కోర్టు మంజూరు కాలేదని వాపోయారు. న్యాయవాదులు కూర్చోవడానికి భవనం లేక చెట్లకిందనే సేద తీరుతున్నామని, నూతన భవనంతోపాటు తమకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ మోహన్, ప్రధాన కార్యదర్శి జుంలాల్, న్యాయవాదులు శ్రీనివాస్ రెడ్డి, కన్నోజు రామకృష్ణ, ఎల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల సహకారంతోనే సొసైటీ బలోపేతం



మాట్లాడుతున్న రాజిరెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): రైతు సహకార సంఘం బలోపేతానికి రైతులు సహకరించాలని పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇర్రి రాజిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రేబర్తి సహకార సంఘ గోడౌన్‌లో మహాజనసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సరిపడా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని, రూ.1.20కోట్ల రుణాలను అందించామని చెప్పారు. అనంతరం ఉప నిబంధన బైలా ఆమోదంతో పాటు పాత బకాయిల వసూలుకు చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మహాజన సభలో తీర్మానించారు. సీఈవో శ్రీధర్, డైరెక్టర్‌లు మ్యాక మల్లేశం, నారోజు శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, కొండ అంజయ్య, జగన్, దేవదాసు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కోహెడ(హుస్నాబాద్): స్థానిక బాడుగుల చెర్వు వద్ద ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎంపీఎం తిరుపతిగౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయించి మద్దతుధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు వెంకటరెడ్డి, బాలకిషన్, వెంకటస్వామి, ఐకేపీ సీసీ రమేశ్, వీఓఏలు, కమిటీ నిర్వాహకులు మంజుల, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

సిద్దిపేటఅర్బన్: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న లారీని పోలీసులు సీజ్ చేశారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై ఉన్న లారీని దాడిచేసి పట్టుకున్నామని త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి నుంచి హైదరాబాద్‌కు తీసుకువెళ్లి ఇసుకను విక్రయిస్తున్నట్టు డ్రైవర్ తెలిపాడన్నారు. అనుమతి లేకుండా ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైస్ ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

- 9 మంది ఎంపీటీసీలకు 8 మందే హాజరు
- ఫలించని కాంగ్రెస్ నాయకుల ప్రయత్నాలు
- సంబరాలు జరుపుకున్న బీఆర్ఎస్ నాయకులు



అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తున్న ఆర్డీఓ బన్సీలాల్

కొండపాక(గజ్వేల్): కొండపాక ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్‌పై ప్రవేశ పెట్టిన అవిశ్వాస తీర్మానం మెజారిటీ కోరం లేకపోవడంతో శనివారం వీగి పోయింది. ఈ విషయాన్ని గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎంపీపీ ర్యాగల్ల సుగుణ, ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్‌పై కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీల మద్దతుతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. 9మందితో ప్రవేశ పెట్టిన రెండు పదవుల అవిశ్వాసాలకు రెండు రోజుల వ్యవధిలో ఓటింగ్ జరిగింది. ఎంపీపీ పదవిపై ప్రవేశపెట్టిన అవిశ్వాసానికి మంచాల అనసూయ, అరుట్ల లక్ష్మి, పత్తి ఆంజనేయులు, చింతల సాయి బాబ, పిల్లి శిరీష, విరుపాక లావణ్య, గురజాడ బాలాజీ, పెద్దసాయిగాని యాదగిరి 9మంది ఎంపీటీసీలు మద్దతు తెలపడంతో అవిశ్వాసం నెగ్గిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్ష పదవి కోసం ప్రవేశ పెట్టిన అవిశ్వాసం సైతం నెగ్గేలా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నయానో భయానో ఆశ చూపుతూ విశ్వ ప్రయత్నాలు చేశారు. అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టడంలో 9మంది ఎంపీటీసీ సభ్యులు సంతకాలు చేశారు. అయితే వారి అభిప్రాయాన్ని రికార్డు చేసేసమయంలో సిర్సనగండ్ల ఎంపీటీసీ సభ్యులు నందాల శ్రీనివాస్ హాజరవ్వకపోవడంతో 8 మంది మాత్రమే పాల్గొన్నారు. దీంతో తమకు మరో గంట సమయం కావాలని ఆర్డీఓను కోరారు. ఐనా అవిశ్వాసం నెగ్గేందుకు 9మంది ఎంపీటీసీల మెజారిటీ ఉండాల్సి ఉండగా 8మంది సభ్యులే హాజరవ్వడంతో అవిశ్వాసం వీగిపోయిందని ఆర్డీఓ బన్సీలాల్ వెల్లడించారు. దీంతో వైస్ ఎంపీపీగా దేవి రవీందర్ కొనసాగుతారన్నారు. నివేదికనుపై అధికారులకు నివేదిస్తామన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు నిరాశతో వెనుదిరిగారు. బీఆర్ఎస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు.

ధర్మమే గెలిచింది



వైస్ ఎంపీపీ పదవిని కాంగ్రెస్ కోటాలో వేసుకునేందుకు ఆ నాయకులు ప్రయత్నించినా ధర్మమే గెలిచింది. అవిశ్వాసం వీగిపోయేందుకు సహకరించిన ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు.

– వైస్ ఎంపీపీ దేవి రవీందర్

రైతు సంక్షేమం పట్టని కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు సంక్షేమం పట్టడం లేదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండల పరిధిలోని కాసులాబాద్‌లో జరుగుతున్న పెద్ద తల్లి దేవాలయ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మల్లన్న సాగర్, రంగనాయక్ సాగర్, కొండ పోచమ్మ ప్రాజెక్టులను నిర్మించి సాగునీరు అందించామన్నారు. కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క మేడిగడ్డ పిల్లర్ పగుళ్లను బూచిగా చూపించి సాగునీటిని వదలడం లేదని మండిపడ్డారు. మల్లన్న సాగర్ ప్రాజెక్టు ద్వారా కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలను వదలక పోవడంతో నియోజకవర్గంలో పంటలు ఎండు ముఖం పడుతుతన్నాయన్నారు. కాంగ్రెస్ మంత్రుల ఆదేశాలు లేనిదే ప్రాజెక్టుల ద్వారా సాగునీరు విడుదలయ్యే పరిస్థితి లేదని ఆరోపించారు. పంటలు ఎండిన తర్వాత మంత్రులు ఆదేశాలు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. ఇప్పటికైనా మల్లన్న సాగర్‌లో నిలువ ఉన్న నీటిని విడుదల చేసి కూడవెల్లి, రామాయంపేట, చిన్న శంకరంపేట, ఉప్పరి పల్లి, కిష్టాపూర్, దుబ్బాక కెనాళ్లకు సాగు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జెడ్పీటీసీ సూకూరి లక్ష్మిలింగం, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బొంపెల్లి మనోహర్‌రావు, కో ఆప్షన్ మెంబర్ ఎండీ. అహ్మద్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మల్లన్న' అభివృద్ధి పనుల్లో అవినీతి

- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్



మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయంలోని గత పాలక మండలి ఆధ్వర్యంలో చేపట్టిన 55 గదుల నిర్మాణం, క్యూ కాంప్లెక్స్, దాసారం గుట్టపైకి వేసిన రోడ్డు పనుల్లోను అవినీతి జరిగిందని, కాంట్రాక్టర్ నుంచి ఆలయ మాజీ చైర్మన్‌కు బాగా ముడుపులు ముట్టాయని ఆరోపించారు. ఈవోకు సంతకంచేసే అథారిటీ ఉన్నప్పటికీ ఫైళ్లను తన దగ్గర పెట్టుకుని డబ్బులు వసూలు చేశాడన్నారు. డిపాజిట్లను అభివృద్ధి పేరుతో విడిపించి వృథా చేశారని మండిపడ్డారు. దాసారం గుట్టపైకి రోడ్డు వేసి రూ4.5కోట్లు కొట్టేశారని, ఈ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు తాడూరి రవీందర్, మండల నాయకులు ఇస్తారి, మల్లేశం, భిక్షపతి, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

యేసు చూపిన మార్గంలో నడవాలి

'రన్ ఫర్ జీసస్'లో పాస్టర్లు



అంబేద్కర్ చౌరస్తావద్ద ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హుస్నాబాద్: నియోజకవర్గ పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడ్ ఫ్రైడే, ఈస్టర్ సండే పండుగలను పురస్కరించుకొని శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద మోకరిల్లి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ సర్వ మానవాళి కోసం యేసుప్రభువు తన ప్రాణాన్ని బలిగా అర్పించారన్నారు. శుభ శుక్రవారం ప్రాణ త్యాగం చేసిన ప్రభువు మూడో రోజు ఆదివారం మరణాన్ని జయించి లేచారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ చైర్మన్ పాస్టర్ మలాకి, సాల్మన్, విజయ్ కుమార్, ప్రకాశ్ రెడ్డి, డేవిడ్, ఇశ్రాయిల్, ఐజాక్, జాన్సన్, వర్గీస్, పీటర్, ప్రేమానందం తదితరులు పాల్గొన్నారు.

ఇన్విజిలేటర్ అసభ్య ప్రవర్తనపై విచారణ



చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మిని విచారిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడ హైస్కూల్లో పదోతరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినిపై ఇన్విజిలేటర్ భాకి చంద్రభాను అసభ్యకరంగా ప్రవర్తించిన విషయమై శనివారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపట్టారు. గత 26న హైస్కూల్లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థినిపై ఇన్విజిటేటర్ అసభ్యకరంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ లక్ష్మిని విచారించారు. అలాగే ఆ విద్యార్థిని నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. శనివారం కూడా మరోసారి విచారించి స్టేట్‌మెంట్‌ను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సంఘటనకు సంబంధించి రిపోర్టులను పైఅధికారులకు నివేదిస్తామన్నారు. వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

సిద్దిపేటరూరల్: దుద్దెడ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు భానుప్రకాశ్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థినులపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. గతంలో నంగునూరు పాఠశాలలో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశామని, అదేవిధంగా చేర్యాలలో అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న శ్రీచైతన్య పాఠశాలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అరవింద్, సంజీవ్, రంజిత్‌రెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ వృత్తికే.. వ్యక్తికి కాదు

అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి



సన్మానిస్తున్న అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి

సిద్దిపేటకమాన్: పదవీవిరమణ వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదని అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి అన్నారు. సీసీఎస్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ గౌడ్, మర్కూక్ పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పరిపూర్ణాచారి శనివారం పదవి విరమణ పొందారు. వారిని పోలీసు కమిషనర్ కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించి, మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఏఓ యాదమ్మ, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర పోలీసు ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగిళ్లలో చోరీ

నగలు, నగదు అపహరించిన దొంగలు



డాగ్ స్క్వాడ్‌తో విచారిస్తున్న పోలీసులు

మిరుదొడ్డి(దుబ్బాక): తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసిన దొంగలు నాలుగిళ్లలో బీభత్సం సృష్టించారు. అందినకాడికి నగలు, నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాలలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరటి అనసూయ ఇంటికి వేసిన తాళం పగులగొట్టిన దొంగలు సుమారు రూ.89వేలపైగా విలువైన బంగారం, వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. అలాగే కేశవాచారి ఇంట్లో రూ.10వేల నగదు, భాస్కరాచారి, గాదె నర్సింహులు ఇంట్లో విలువపైన వస్తువులు ఎత్తుకెళ్లారు. దీంతో బాధితులు మిరుదొడ్డి పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న సిద్దిపేట ఏసీపీ మధు, దుబ్బాక సీఐ శ్రీనివాస్, మిరుదొడ్డి ఎస్ఐ బోయిని పరశురామ్ నేతృత్వంలో పోలీస్ సిబ్బంది డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో విచారణ చేపట్టారు. చోరీ జరిగిన ఇండ్లను పరిశీలించారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని చెప్పారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న శివప్రసాద్

ములుగు(గజ్వేల్): ఫర్టిలైజర్ డీలర్లు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ హెచ్చరించారు. శనివారం ములుగు మండల కేంద్రంలోని మణికంఠ, వంటిమామిడిలోని యాదగిరి, సింగన్నగూడలోని మారుతీ ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ డీలర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. యూరియా, డీఏపీల నిలువలను ఇ-పాస్ మిషన్ ద్వారా పరిశీలించి రిజిష్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ ప్రగతి, ఏ ఈఓ పృథ్వి పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌పై జేఏసీ ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న జేఏసీ నాయకులు

హుస్నాబాద్: మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు హరీశ్ కేటీఆర్, కల్వకుంట్ల కవిత, జోగినపల్లి సంతోష్‌రావు తమ ఇష్టారాజ్యంగా చేసిన అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని, పాస్‌పోర్టులను సీజ్‌చేసి చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందన్నారు. అవినీతి సొమ్మును వారి నుంచి రాబట్టి ప్రజల పరం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, కో ఆర్డినేటర్లు డ్యాగల సారయ్య, మేకల వీరన్న యాదవ్, ప్రొఫెసర్ వీరన్న నాయక్, నాయకులు గడిపె మల్లేశ్, కొయ్యడ కొమురయ్య, పచ్చిమట్ల శ్రీనివాస్ గౌడ్, పెరుమాండ్ల నర్సాగౌడ్, పోచయ్య, సమ్మయ్య, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించేది లేదు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాకటౌన్: బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని విమర్శిస్తే సహించేది లేదని మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్ మండిపడ్డారు. శనివారం దుబ్బాకలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రఘునందన్‌రావు ఉప ఎన్నికల్లో గెలిచి దుబ్బాకను అభివృద్ధి చేస్తే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు ఎందుకు ఛీకొట్టారో ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. రఘునందన్‌రావు నోరు అదుపులో పెట్టుకోకపోతే సహించేది లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బత్తుల స్వామి, బాలకృష్ణ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఆస స్వామి, బీఆర్ఎస్ నాయకులు భూంరెడ్డి, రాజమౌళి పంతులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): రాజీవ్ రహదారిపై గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని గౌరారం పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సీఐ మహేందర్ రెడ్డి, ఎస్ఐ శివకుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. సమాచారం మేరకు రాజీవ్ రహదారి గౌరారం స్టేజీ సమీప పాములపర్తి టర్నింగ్ వద్దకు చేరిన ఎస్ఐకు మర్కూక్‌కు చెందిన మొర్సు విఘ్నేందర్(20), పాములపర్తికి చెందిన పిట్ల రాజు(20) అనుమానాస్పదంగా కన్పించారు. వారిని తనిఖీ చేయగా బ్యాగులోని ప్లాస్టిక్ కవర్‌లో 60 గ్రాముల గంజాయి దొరికింది. చుట్టుపక్కల గ్రామాల యువకులు, లేబర్‌కు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందన్నారు. వారిని అరెస్ట్ చేసి వారి నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ రజకులకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి

దుబ్బాక: రజకులకు ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి భహిరంగంగా క్షమాపణ చెప్పాలని లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని రజక సంఘం నాయకుల తొగుట రవీందర్ హెచ్చరించారు. శనివారం దుబ్బాకలో రజక సంఘం సభ్యులు నిరసన తెలిపారు. ఎమ్మెల్యే రజకులపై అవమానకరంగా మాట్లాడడం దారుణమన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహులు, రాజు, బాబు, కాశీ, మహేందర్ తదితరులు ఉన్నారు.

◆ సహాయంచేసి ఆదుకోండి

బెజ్జంకి(సిద్దిపేట): మెదడుకు శస్త్ర చికిత్స చేయగా కోమాలో ఉన్న ఓ వ్యక్తికి ఆర్థిక సహాయం చేయాలని అతడి కుటుంబ సభ్యులు కోరారు. మండలంలోని గాగిల్లాపూర్ గ్రామానికి చెందిన అంకం సతీశ్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. నాలుగు రోజుల క్రితం మెదడులో రక్తం గడ్డకట్టగా వైద్యులు శస్త్ర చికిత్స చేశారు. అప్పటి నుంచి కోమాలో ఉన్నాడు. ఇప్పటి వరకు రూ.4లక్షలు ఖర్చు చేసినా ఫలితంలేదని కుటుంబ సభ్యులు వాపోయారు. అతడికి తల్లి, భార్య, కుమారుడు ఉన్నారు. దాతలు స్పందించి 95506 23763, 94419 20274కు నగదు పంపించి ఆదుకోవాలని వేడుకున్నారు.

◆ మాల మహానాడు నేతకు అభినందనలు

మిరుదొడ్డి(దుబ్బాక): జాతీయ మాల మహానాడు తెలంగాణ పొలిట్ బ్యూరో చైర్మన్‌గా ఎన్నికైన ర్యాకం శ్రీరాములును శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మాల మహానాడు నాయకులు కలిసి సన్మానించారు. పొలిట్ బ్యూరో చైర్మన్‌గా ఎన్నిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, జక్కుల రాజయ్య, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు ధార స్వామి, రాజేందర్, సుమన్ పాల్గొన్నారు.

◆ కేకే, కడియం వల్ల పార్టీకి నష్టంలేదు..

చేర్యాల(సిద్దిపేట): బీఆర్ఎస్ పార్టీతో లబ్ధిపొంది, కేసీఆర్‌ను కాదని వెళుతున్న వారికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ గడిచిన 23 ఏళ్లలో ఎంతో మంది పార్టీలోకి వచ్చారు.. పోయారు కానీ ఉద్యమకారులు అలాగే ఉన్నారన్నారు. కేవలం అధికార దాహంతో పార్టీ మారుతున్న కేకే, కడియం వల్ల పార్టీకి ఎటువంటి నష్టం జరగదని చెప్పారు. పార్టీ మారడాన్ని తెలంగాణ ప్రజానీకం చీదరించుకుంటుందన్నారు.

◆ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మణికంఠరెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ తీసుకువచ్చిన నూతన విద్యావిధానం సక్రమంగా లేదన్నారు. ఈ విద్యావిధానం వల్ల అనేక మంది మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరం అవుతారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జెర్రిపోతుల జనార్దన్, సంగెం మధు, రామగళ్ల నరేశ్, వేల్పుల ప్రసన్నకుమార్, ఆకుల శిరీష పాల్గొన్నారు.

◆ రంజాన్ తోఫాలను అధికారులే పంపిణీ చేయాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందు వల్ల రంజాన్ తోఫాలను జిల్లా అధికారులే పంపిణీ చేయాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కలీమొద్దీన్ కోరారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు పంపిణీ చేయాలని, రంజాన్ తోఫాలపై బీఆర్ఎస్ పార్టీ రాజకీయం చేయడం తగదన్నారు. అలాగే మరో సమావేశంలో అత్తు ఇమామ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ ముస్లింలకు పంపిణీ చేసేందుకు రంజాన్ తోఫాలను మదీనా ఫంక్షన్‌హాల్‌లో నిల్వ ఉంచితే బీఆర్ఎస్ నాయకులు ఆక్షేపించడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో అధికారులు ఈ తోఫాలను పంపిణీ చేయాలన్నారు.

◆ ఉపాధ్యాయుడిదే ముఖ్య భూమిక

సిద్దిపేటజోన్: దేశ అభ్యున్నతిలో ఉపాధ్యాయుడిదే ముఖ్య భూమిక అని జెడ్పీ చైర్మన్ రోజాశర్మ అన్నారు. శనివారం స్థానిక టీటీసీ భవన్‌లో జరిగిన ఓ ప్రైవేట్ స్కూల్ వార్షికోత్సవ సభలో ఆమె పాల్గొన్నారు. విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దే అవకాశం ఒక్క టీచర్‌కే ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తమ్ రెడ్డి, ఎంఈఓ యాదవరెడ్డి, ట్రెస్మా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు శర్మ తదితరులు పాల్గొన్నారు.

◆ స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

హుస్నాబాద్: పట్టణంలో ఓ పాత సామాను దుకాణంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. శనివారం నాగారం రోడ్డులోని ఓ పాత సామాను దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులకు మంటలు అంటుకున్నాయి. దీంతో కాలనీలో దట్టమైన పొగలు అలముకున్నాయి. స్థానికులు నీళ్లతో మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. పోలీసులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను పూర్తిగా అదుపులోకి తేవడంతో కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు. పూర్తివివరాలు తెలియవలసి ఉంది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కాంగ్రెస్‌లో చేరినవారితో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

ములుగు(గజ్వేల్): అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తూరులో శనివారం బీఆర్ఎస్‌కు చెందిన మాజీ సర్పంచ్ కటికె శంకర్, జోగిని రవి, వెంకటేశ్‌గౌడ్, రమేశ్, స్వామి, నర్సింగరావు, కుమార్ తదితరులు కాంగ్రెస్‌లో చేరగా వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు తమ్మలి శ్రీనివాస్, నాయకులు గణేష్‌యాదవ్, నర్సింహ, సతీష్‌గౌడ్, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.